www.ninadam.in
# నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
బుధవారం మే 06 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్

## కాంగ్రెస్‌లో పదవుల జాతర.. నామినేటెడ్ పోస్టులు ప్రకటించిన టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, మే 6 (నినాదం) :
తెలంగాణలో నామినేటెడ్ పదవులు పండగ మళ్లీ మొదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పలు కార్పొరేషన్లకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఛైర్మన్లను ప్రకటించారు. మొత్తం 17 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, 11 వైస్ ఛైర్మన్లను ప్రకటించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొమ్మ శ్రీ రామ్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బండి రమేశ్, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బస్వరాజు శ్రీనివాస్, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గూడెం వెంకటరమణను ప్రకటించారు.



## న్యూఢిల్లీలో కేంద్ర ఎం.ఎల్. ఖట్టర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ భేటీ

న్యూ ఢిల్లీ, మే 6 (నినాదం) :
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్, ఈరోజు న్యూఢిల్లీలోని 3, కృష్ణ మీనన్ మార్గ్‌లో ఉన్న తన నివాసంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి ఎం.ఎల్. ఖట్టర్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో, పట్టణ రవాణాను బలోపేతం చేయడంలోనూ, నగరం 02



## తమిళనాడు గవర్నర్‌ను కలిసిన టీవీకే పార్టీ అధినేత విజయ్

ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటూ ఆహ్వానం నేపథ్యంలో కలిసిన విజయ్

నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

చెన్నై మే 6 (నినాదం) :
టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ చెన్నైలోని 02

## తడిసినా ధాన్యం కొనుగోలు

- కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు
- ధాన్యం రవాణాపై స్పెషల్ ఫోకస్
- రైతు ప్రయోజనాలే ప్రాధాన్యం
- అకాల వర్షాలపై వెంటనే చర్యలు
- రైతులకు అండగా ప్రభుత్వం భరోసా



మంథని, మే 6 (నినాదం) :
ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి 02



# రైతు డిక్లరేషన్ .. ఓ బోగస్ పత్రం..

- రైతులను వంచించిన రేవంత్, రాహుల్
- రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు
- రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది
- కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..రైతులకు న్యాయం
- బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం
- రైతు సంగ్రామ సదస్సులో కెటిఆర్ విమర్శలు

రైతులు ధైర్యం కోల్పోవద్దు..

ఆత్మహత్యలకు అస్సలు పాల్పడవద్దు

కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి

వారందరికీ పదిలక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు.

వరంగల్, మే 6 (నినాదం) :
రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ 02

## అన్నదాతల అరిగోస ప్రభుత్వానికి పట్టదా

\- బండి సంజయ్

హైదరాబాద్, మే 6 (నినాదం) :
కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఫైర్ అయ్యారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని, వడ్ల కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కన్నీళ్లకు బాధ్యులెవరని ప్రశ్నించారు. అకాల వర్షాలు, ఈదురు 02



## ప్రైవేటు స్కూళ్ల దోపిడీపై కవిత ఫైర్



ఫీజుల నియంత్రణకు తక్షణ చర్యల డిమాండ్

విద్య వ్యాపారంగా మారిందని విమర్శ

సీఎం వైఖరిపై కవిత విమర్శలు

హైదరాబాద్ మే 6 (నినాదం) :
విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల బాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. "ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవే. వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలి. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా 02

## రాజీనామా చేయనంటున్న మమత.. కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు ఈసీ నోటిఫికేషన్

- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించిన ఈసీ
- రాష్ట్రంలో అధికారికంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ
- మే 9న ప్రమాణస్వీకారం చేయాలనుకుంటున్న బీజేపీ



కోల్‌కత్తా, మే 6 (నినాదం) :
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాజ్యాంగపరమైన ప్రక్రియలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలో కొత్త శాసనసభ ఏర్పాటుకు సంబంధించి భారత ఎన్నికల సంఘం అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌ను అధికారులు గవర్నర్‌కు సమర్పించడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ 02


## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి?

ఒకప్పటి తన రాజకీయ గురువు మమతా బెనర్జీ స్థానంలో బాధ్యతలు

శుక్రవారం కోల్‌కతాలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం

సువేందు పేరును అధికారికంగా ప్రకటించనున్న అమిత్ షా

మమతపై రెండుసార్లు గెలిచి హీరోగా మారిన సువేందు



కోల్‌కత్తా, మే 6 (నినాదం) :
పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలుకానుంది. ఒకప్పటి తన రాజకీయ గురువైన మమతా బెనర్జీ స్థానంలో బీజేపీ నేత సువేందు అధికారి రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఎల్లుండి (శుక్రవారం) కోల్‌కతాలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో సువేందు అధికారిని 02

## రాహుల్, రేవంత్‌లపై వ్యాఖ్యలు

కెటిఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలి

మంత్రి సీతక్క డిమాండ్



హైదరాబాద్, మే 6 (నినాదం) :
కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి 02

## స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ.. ఓటమి వేళ సంఘీభావం

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ
- కష్టకాలంలో అండగా ఉంటానని స్టాలిన్‌కు హామీ ఇచ్చిన రజనీ
- 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ పార్టీ టీవీకే
- ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్, ఇతర పార్టీల మద్దతు కోరుతున్న విజయ్
- చెన్నైకి చేరుకున్న గవర్నర్.. మరింత పెరిగిన రాజకీయ ఉత్కంఠ

02

చెన్నై మే 6 (నినాదం) :
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే ఓటమి నేపథ్యంలో ఆ పార్టీ అధినేత ఎంకే స్టాలిన్‌తో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇవాళ చెన్నైలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ప్రభుత్వ



## సినిమా పేరుతో 25 లక్షల మోసం

సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు



ముంబయి, మే 6 (నినాదం) :
ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు 02

## యూపిలో దారుణ ఘటన

బాలుడిపై అత్యాచారం హత్య

దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు



లక్నో, మే 6 (నినాదం) :
ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం 02

# 2028 నాటికి 80% ఏసీలు ఏపీలోనే.. దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్


శ్రీసిటీలో ఇప్పటివరకు 70,000 ఉద్యోగాలు, వాటిలో 50శాతం మహిళలకే వచ్చాయని వ్యాఖ్య

2028 నాటికి దేశంలోని 80శాతం ఏసీలు ఏపీలోనే తయారీ లక్ష్యమన్న మంత్రి

యువత కోసం మే చివరిలో 'నైపుణ్యం' పేరుతో ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్

రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడి

ఏపీని దేశానికి 'కూల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతామన్న మంత్రి లోకేశ్




శ్రీసిటీ, మే 6 (నినాదం) :
ఏపీని దేశంలోనే కీలక పారిశ్రామిక హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, త్వరలోనే రాష్ట్రాన్ని 'భారతదేశపు కూల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ప్రముఖ ఏసీ తయారీ సంస్థ 'క్యారియర్' యూనిట్ ఏర్పాటుకు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2028 నాటికి భారతదేశానికి అవసరమైన 80 శాతం ఎయిర్ కండిషనర్లను (ఏసీ) ఏపీలోనే తయారు చేసే స్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీసిటీ సాధించిన ప్రగతిని వివరిస్తూ... "సుమారు 8,500 ఎకరాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీలో 31 దేశాలకు చెందిన




250 కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఏటా 6 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 70,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. అందులో 50 శాతం ఉద్యోగాలు మహిళలకు దక్కడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని లోకేశ్ తెలిపారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ వరకు విభిన్న రంగాల్లో శ్రీసిటీ 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు ప్రతీకగా నిలుస్తోందని, క్యారియర్ రాకతో ఈ ప్రగతి ప్రస్థానంలో మరో మైలురాయి చేరిందని ఆయన పేర్కొన్నారు. ఏపీని ఏసీ తయారీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంపై మాట్లాడుతూ.. "ఇప్పటికే 9 ప్రముఖ ఏసీ తయారీ కంపెనీలు, 30కి పైగా అనుబంధ పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఈ 02

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

బుధవారం మే 06 2026

ninadam.in




## ప్రైవేటు స్కూళ్ల దోపిడీపై కవిత ఫైర్

ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా?" అని కవిత ప్రశ్నించారు

## సినిమా పేరుతో 25 లక్షల మోసం

కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ఎ÷–లాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

## తమిళనాడు గవర్నర్‌ను కలిసిన టీవీకే పార్టీ అధినేత విజయ్

లోక్ భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అత్యధిక స్థానాలు గెలుచుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ కార్యాలయం విజయ్‌కి ఆహ్వానం పంపించింది. ఈ క్రమంలో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తనకు తగిన బలం ఉందని చెప్పడానికి లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. తనకు మద్దతిచ్చే జాబితాతో కూడిన లేఖను గవర్నర్‌కు అందజేశారు. ఇప్పటికే, చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ కూటమిగా పోటీ చేశాయి. కానీ ఎన్నికల అనంతరం, టీవీకేకు మెజారిటీ కొన్ని సీట్లు తగ్గడంతో కాంగ్రెస్ టీవీకేకు మద్దతిచ్చేందుకు సిద్ధమైంది.

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి?

శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య ఆయన పేరును ప్రతిపాదించనుండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ తరఫున సువేందు అధికారి బలమైన అభ్యర్థిగా నిలిచారు. ఒకప్పుడు మమతా బెనర్జీ అధికారంలోకి రావడానికి కారణమైన నందిగ్రామ్‌లో ఆమెపై గెలిచి సంచలనం సృష్టించారు. తాజాగా ఆమె కంచుకోటగా భావించే భవానీపూర్‌లోనూ భారీ మెజారిటీతో విజయం సాధించి, పార్టీలో తిరుగులేని నేతగా ఆవిర్భవించారు. ఈ విజయాలే ఆయనను ముఖ్యమంత్రి పీఠం వైపు నడిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ జై..

# ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు

- తమిళనాడులో విజయ్ పార్టీకి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్
- టీవీకేకు 108 సీట్లు రాగా, మెజార్టీకి మరో 10 సీట్లు అవసరం
- లౌకిక, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకే తమ మద్దతన్న కార్తీ చిదంబరం
- తమకు మద్దతు ఇవ్వాలని టీవీకే అధికారికంగా లేఖ రాసిందని వెల్లడి



చెన్నై, మే 6 (నినాదం) : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతిచ్చి, ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా నిర్ణయించింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం బుధవారం ధ్రువీకరించారు. తమిళనాడు ప్రజలు లౌకిక మార్పును కోరుకున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో కార్తీ చిదంబరం మాట్లాడుతూ... "టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతివ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. టీవీకే 108 స్థానాలు గెలుచుకుంది. తమిళనాడు ప్రజలు ఆ పార్టీ నాయకత్వంలోనే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. మెజార్టీకి అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకోవడానికి టీవీకే అధికారికంగా కాంగ్రెస్ పార్టీని సంప్రదించింది. దీనిపై మా పార్టీలోని అన్ని వేదికల్లో చర్చించి, ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని తీర్మానించాం. ప్రజలు కేవలం మార్పునే కాదు, లౌకిక ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. అందుకే తమిళనాడులో ఒక స్థిరమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటానికి మేము సహాయం చేస్తున్నాము" అని వివరించారు. అంతకుముందు టీవీకే, కాంగ్రెస్ మధ్య పొత్తుపై ఊహాగానాలు రాగా, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గిరీష్ చోడంకర్ దీనిపై స్పష్టతనిచ్చారు. మద్దతు కోరుతూ టీవీకే తమ పార్టీకి లేఖ రాసిందని, దానిపై ఢిల్లీలోని అధిష్ఠానం చర్చించిందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతలు, నూతన ఎమ్మెల్యేలతో కలిసి నిర్వహించే మీడియా సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన చెప్పారు. "మా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు టీవీకే లేఖ ఇచ్చింది. దీనిపై నిన్న ఢిల్లీలో చర్చ జరిగింది. తదుపరి కార్యాచరణను ఉదయం 11 గంటలకు సత్యమూర్తి భవన్‌లో తెలియజేస్తాం" అని చోడంకర్ పేర్కొన్నారు. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. టీవీకే 108 స్థానాల్లో గెలుపొంది మెజార్టీకి 10 సీట్ల దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మద్దతుతో పాటు లెఫ్ట్ ఫ్రంట్ వంటి ఇతర చిన్న పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే సిద్ధమవుతోంది.

## విజయ్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు..

## తీవ్రంగా స్పందించిన డీఎంకే

- కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలో ఇలాగే చేస్తోందన్న డీఎంకే అధికార ప్రతినిధి
- అందుకే వరుసగా అన్ని రాష్ట్రాల్లో ఓడిపోతోందని ఇలంగోవన్ మండిపాటు

చెన్నై, మే 6 (నినాదం) : తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడంపై డీఎంకే పార్టీ తీవ్రంగా స్పందించింది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన కొంతమంది ప్రజాప్రతినిధులు మొదటి నుంచి విజయ్‌కి మద్దతు ఇవ్వాలనే అభిప్రాయంతో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలో ఇలాగే చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీ వ్యవహారశైలి కారణంగానే వరుసగా అన్ని రాష్ట్రాల్లో ఓడిపోతోందని అన్నారు. గత సంవత్సరం ఢిల్లీ, ఇప్పుడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని ఆయన మండిపడ్డారు. మహారాష్ట్రలో వారికి ఏమాత్రం అవకాశం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీని పూర్తిగా మూసివేసే పనులనే వారు చేస్తున్నారని విమర్శించారు.

**టీవీకే కార్యాలయానికి కాంగ్రెస్ నేతలు**

అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీతో కాంగ్రెస్ పొత్తు ఖరారు చేసుకుంది. చెన్నైలోని టీవీకే కార్యాలయానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వచ్చారు. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించేందుకు కాంగ్రెస్ నాయకులు సుముఖత వ్యక్తం చేయగా, వారి నిర్ణయాన్ని విజయ్ స్వాగతించారు.

## డీఎంకే, తృణమూల్ పార్టీలకు ఆయా రాష్ట్రాల్లో పనిచేసిన ఐ-ప్యాక్

- నిధుల కొరత కారణంగా ఐ-ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు వెల్లడి
- డీఎంకే, తృణమూల్ ఓటమి నేపథ్యంలో ఒప్పందం రద్దు చేసుకున్నట్లు ప్రచారం
- ఈ ప్రచారాన్ని ఖండించిన అఖిలేష్ యాదవ్



కోల్‌కత్తా, మే 6 (నినాదం) : తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూశాయి. ఈ రెండు పార్టీలకు ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని ఐ–ప్యాక్ పనిచేసింది. అయితే ఈ ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐ–ప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐ–ప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఐ–ప్యాక్ టీమ్ తమతో కొన్ని నెలలు పని చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా దానిని కొనసాగించలేకపోతున్నామని వెల్లడించారు. బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే ఓటమి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఐప్యాక్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. "మా వద్ద నిధులు లేవు. మీరు (మీడియా) మాకు నిధులు ఇస్తే మరో కంపెనీని ఎన్నికల కోసం నియమించుకుంటాం" అని అఖిలేష్ సరదాగా అన్నారు. కానీ, ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును ఆయన అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం..

నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమిషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆగమైన తెలంగాణను బాగుచేసింది బీఆర్ఎస్ అని తెలిపారు. రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే రైతును బాగా చూసుకున్న నాయకుడు దేశంలోనే లేడని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతు ప్రగతికి విప్లవం సృష్టించామని అన్నారు. పదేళ్లలో రైతులకు రూ.5లక్షల కోట్లు ఖర్చుపెట్టిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగు పెరిగి వరంగల్‌లో భూముల రేట్లు పెరిగాయని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక భూముల ధరలు పడిపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం వానల్లో, ఎండల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనుకటి రోజులు వస్తున్నాయని వాపోయారు.

## యూపిలో దారుణ ఘటన

చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

## 2028 నాటికి 80% ఏసీలు ఏపీలోనే..

## దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్

ఎకోసిస్టమ్‌లో సుమారు రూ. 12,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2027 నాటికి దేశంలోని 60% ఏసీలను ఇక్కడే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పుడు క్యారియర్ రాకతో 2028 నాటికి 80% లక్ష్యాన్ని చేరుకుంటాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి క్లస్టర్ ఆధారిత వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు మంత్రి వివరించారు. "భవిష్యత్తు మొత్తం ఎకోసిస్టమ్స్, క్లస్టర్లదే. ఒక ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకులు, పరికరాల నుంచి పూర్తిస్థాయి తయారీ వరకు ఒకేచోట ఉండేలా వర్టికల్ ఇంటిగ్రేషన్‌తో పాటు, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ వంటి అంశాలతో హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పైనా దృష్టి సారించాం" అని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఏసీ క్లస్టర్, గ్లాస్ క్లస్టర్, స్పేస్ సిటీ, పునరుత్పాదక ఇంధన క్లస్టర్, డేటా సెంటర్ క్లస్టర్ వంటివి వీటిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న మరో కీలక నిర్ణయాన్ని లోకేశ్ ప్రకటించారు. "యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక సంభాషణ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జశీఅజవతీయ్ఖశీఱఖ్రీ ూ×) స్కిల్ అసెస్‌మెంట్ పోర్టల్‌ను ఈ మే నెలాఖరులోగా ప్రారంభిస్తున్నాం" అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

## న్యూఢిల్లీలో కేంద్ర ఎం.ఎల్. ఖట్టర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ భేటీ

యొక్క పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడంలోనూ హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–×× ప్రాజెక్ట్ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, దానికి ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. కనెక్టివిటీని మెరుగుపరచడంలో, హైదరాబాద్ భవిష్యత్ విస్తరణకు తోడ్పడటంలోనూ దాని వ్యూహాత్మక పాత్రను హైలైట్ చేస్తూ, ఫేజ్–××× కింద ఆర్‌జీఐఏ విమానాశ్రయంఉభారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. నగర అభివృద్ధికి, దీర్ఘకాలిక వృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై ఈ సమావేశం దృష్టి సారించింది.

## తడిసినా ధాన్యం కొనుగోలు

నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి మంథని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మంథని ఆర్డీఓ సురేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్నదాతల అరిగోస ప్రభుత్వానికి పట్టదా

గాలులతో చాలాచోట్ల వడ్లు కొట్టుకుపోతున్నా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. అన్నదాతల బాధలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా అంటూ కేంద్ర మంత్రి నిలదీశారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోళ్లు లేక రైతులు అరిగోస పడుతుంటే పట్టించుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతుల ఆరుగాలం కష్టమంతా నీళ్లపాలవుతోందన్నారు. ప్రతి గింజ కొనుగోలుకు కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమిటని అన్నారు. వడ్లను కొనుగోలు చేసినందుకు కమీషన్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమే చెల్లిస్తోందని.. అయినా వడ్ల కొనుగోలులో నిర్లక్ష్యం ఎందుకని మండిపడ్డారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లకు గాను 16 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేని దుర్మార్గపు ప్రభుత్వమిది అంటూ విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రికి ఢిల్లీ పర్యటనలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేకపోవడం శోచనీయమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. రైతులు పడుతున్న కష్టాలను ప్రస్తావిస్తే ఎదురు దాడి చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన వడ్లను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిందే అని.. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. సీఎం సహా మంత్రులంతా యాసంగి వడ్ల కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## రాజీనామా చేయనంటున్న మమత..

## కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు ఈసీ నోటిఫికేషన్

అధికారికంగా ముగిసినట్లయింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితా గవర్నర్ వద్దకు చేరడంతో, మెజారిటీ సాధించిన పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించే మార్గం సుగమమైంది. మరోవైపు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించడంతో రాష్ట్రంలో రాజకీయ వేడి రాజుకుంది. అయితే ఈసీ తాజాగా విడుదల చేసిన 'కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ న్యూ అసెంబ్లీ' నోటిఫికేషన్ ఆమెకు ఊహించని షాక్‌గా మారింది. ఇప్పటికే మే 9వ తేదీన నూతన ప్రభుత్వం కొలువుదీరాలని బీజేపీ భావిస్తున్న తరుణంలో, ఈ నోటిఫికేషన్ విడుదల కావడం ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. అమిత్ షా వంటి అగ్రనేతల పర్యవేక్షణలో కొత్త ముఖ్యమంత్రి ఎంపిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

## రాహుల్, రేవంత్‌లపై వ్యాఖ్యలు

నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు. వరంగల్ వేదికగా కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజానికి రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు. ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క–సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

## స్టాలిన్‌తో రజనీకాంత్ భేటీ.. ఓటమి వేళ సంఘీభావం



ఏర్పాటుపై తీవ్రమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలైన నేపథ్యంలో స్టాలిన్‌కు సంఘీభావం తెలిపేందుకే రజనీకాంత్ ఆయన్ను కలిశారని సమాచారం. ఈ కష్టకాలంలో తాను ఆయనకు అండగా ఉంటానని రజనీ భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. కొంతసేపు జరిగిన ఈ భేటీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డీఎంకే కూటమిలోని వీసీకే, వామపక్షాల నేతలు కూడా పార్టీ ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో స్టాలిన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 234 స్థానాలకు గాను స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కేవలం 59 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది. నూతనంగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి చేరువలో ఆగిపోయింది. దీంతో టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ షరతులతో కూడిన మద్దతు ప్రకటించగా, సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతో కూడా టీవీకే సంప్రదింపులు జరుపుతోంది. ఈ రాజకీయ పరిణామాల మధ్య తమిళనాడు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గవర్నర్ ఆర్.వి. అర్లేకర్ చెన్నైకి చేరుకోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ మరింత పెరిగింది. రాబోయే రోజుల్లో రాష్ట్రం సంకీర్ణ రాజకీయాల శకంలోకి అడుగుపెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
బుధవారం మే 06 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్


## సామాన్య మహిళగా
# బస్టాండ్‌లో సీపీ సుమతి...

- ఆకతాయిల ఆగడాలు అరికట్టేందుకు సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్
- సాధారణ మహిళగా బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడిన సీపీ
- ఆమెను వేధించిన సుమారు 40 మంది యువకులు
- పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే
- అందరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు




**మల్కాజిగిరి మే 06(నినాదం):** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి. సుమతి ఆకతాయిల ఆగడాలపై ఉక్కుపాదం మోపారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగి, అర్ధరాత్రి ఓ బస్టాండ్‌లో సామాన్య మహిళగా నిలబడ్డారు. ఆమెను గుర్తుపట్టని పోకిరీలు వేధించడంతో, అక్కడే మాటువేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నిన్న అర్ధరాత్రి మల్కాజిగిరి పరిధిలోని ఓ బస్టాండ్‌కు సీపీ సుమతి ఒంటరిగా చేరుకున్నారు. ఆమె ఉన్నతాధికారి అని తెలియని సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరారు. రకరకాల ప్రశ్నలతో ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలో సాధారణ మహిళలు ఎదుర్కొనే వేధింపులను ఆమె స్వయంగా అనుభవించారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఆకతాయిల వేధింపులు శ్రుతి మించడంతో అక్కడికి చేరుకున్న ప్రత్యేక పోలీస్ బృందాలు వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం యువకులందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, భవిష్యత్తులో ఇలాంటి పనులకు పాల్పడవద్దని హెచ్చరించి పంపించారు. మహిళల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సుమతి ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపారు.

## మెదక్‌లో దారుణం..
# పసికందును రూ.1.50 లక్షలకు అమ్మేసిన నర్సు

- బిడ్డ చనిపోయిందని తల్లిని నమ్మించి మోసం
- రూ.1.50 లక్షలకు శిశువును విక్రయించిన వైనం
- ఐదు రోజుల తర్వాత తల్లికి తెలిసిన అసలు నిజం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



**మెదక్ మే 06(నినాదం):** మెదక్ జిల్లాలో అత్యంత దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన పసికందు చనిపోయిందని తల్లిని నమ్మించిన ఓ నర్సు, ఆ శిశువును రూ. 1.50 లక్షలకు విక్రయించింది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అసలేం జరిగిందంటే..!

పాపన్నపేట మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన నస్రా ఫాతిమా సికింద్రాబాద్‌లోని మౌలాలిలో నివసిస్తోంది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమె, ఇటీవల తన అత్తగారింటికి వెళ్లేందుకు మెదక్‌కు వచ్చింది. బస్టాండ్‌లో ఆమె చేతిలోని చిప్స్ ప్యాకెట్‌ను చూసిన కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనతో భయపడిపోయిన ఆమెను స్నేహితురాలు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు శస్త్రచికిత్స చేయగా, ఫాతిమా ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, అదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అక్తరీ బేగం, పుట్టిన పాప చనిపోయిందని ఫాతిమాను నమ్మించింది. నర్సు మాటలు నిజమని భావించిన ఫాతిమా, తీవ్ర దుఃఖంతో మూడు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లింది. అయితే, ఐదు రోజుల తర్వాత ఓ వ్యక్తి ద్వారా తన పాప బతికే ఉందని ఫాతిమాకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి, నర్సు అక్తరీ బేగంపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## జాతర పేరుతో జరిగేది
# దారుణమైన మారణకాండ

- తిరుపతి గంగమ్మ జాతరలో జంతుబలులు నిలిపివేయాలని సీఎంకు మేనకా గాంధీ లేఖ
- పలు రాష్ట్రాల్లో ఇప్పటికే జంతుబలులపై నిషేధం ఉందని ప్రస్తావన
- జంతుబలులకు బదులుగా కొబ్బరికాయలు సమర్పించేలా ప్రోత్సహించాలని సూచన
- ముందుచూపు ఉన్న సీఎంగా పేరున్న మీరు దీన్ని ఆపలేరా అని లేఖలో ప్రశ్న



**అమరావతి, మే 6 (నినాదం) :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ జంతు సంరక్షకురాలు మేనకా గాంధీ ఒక లేఖ రాశారు. తిరుపతిలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న గంగమ్మ జాతర సందర్భంగా భారీ ఎత్తున జరిగే జంతు బలులను నిరోధించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గంగమ్మ ఆలయం వద్ద జాతర పేరుతో పెద్ద సంఖ్యలో జంతువులను బలి ఇవ్వనున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ హింసను ఆపాలని ఆమె కోరారు. దేశంలో అనేక రాష్ట్రాలు ఇప్పటికే జంతు బలులను పూర్తిగా నిషేధించాయని మేనకా గాంధీ తన లేఖలో గుర్తుచేశారు. ఏపీకి పొరుగున ఉన్న కర్ణాటకలో కూడా జంతుబలులను నిషేధించి, వాటికి బదులుగా కొబ్బరికాయలు కొట్టేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నారని ఆమె ఉదహరించారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు సైతం ఈ విషయంలో కఠినమైన చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. టెక్నాలజీతో పాటు అనేక విషయాల్లో దేశంలోనే అత్యంత ముందుచూపు ఉన్న ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు ఒకరని ప్రశంసించిన మేనకా గాంధీ, అలాంటి మీరు ఈ జంతుబలులను ఆపడం సాధ్యం కాదా? అని ప్రశ్నించారు. జంతుబలులు సమాజంలో హింసను ప్రేరేపిస్తాయని, ఇది మంచిది కాదని అభిప్రాయపడ్డారు. బలుల కోసం ఆలయాలకు వచ్చేవారు చాలా సందర్భాల్లో మద్యం సేవించి ఉంటారని, ఇది మరిన్ని హింసాత్మక ఘటనలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "జాతర పేరుతో జరిగే ఈ మారణకాండను దేశం మొత్తం చూస్తోంది. ఇవి దేశంలోనే అత్యంత దారుణమైన సామూహిక హత్యలుగా మారుతున్నాయి. ఏ కారణం లేకుండా వేలాది మూగజీవాలను చంపడం దారుణం" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాల అభివృద్ధికి నిధులు ఇవ్వవచ్చని, జంతుబలులకు బదులుగా కొబ్బరికాయలు సమర్పించేలా భక్తులను చైతన్యపరచాలని సూచించారు. గతంలో కూడా ఎంతోమంది యువకులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఈ బలులను ఆపాలని తనకు లేఖలు రాశారని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని, తక్షణమే జంతుబలులను ఆపేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబును మేనకా గాంధీ కోరారు.

# రేషన్ కార్డుదారులకు తీపికబురు..
# ఇకపై షాపుల్లో జొన్నల పంపిణీ!



**హైదరాబాద్, మే 6 (నినాదం) :** ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్)లో తెలంగాణ సర్కార్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు పౌష్టికాహారమైన జొన్నలనుకూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించి ప్రభుత్వం ప్రాథమిక కసరత్తును వేగవంతం చేసింది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన జొన్నలు, మొక్కజొన్నలను రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులోకి తేవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడంలో భాగంగా జొన్నలను వినియోగించాలని భట్టి సూచించారు. కేవలం అన్నం మాత్రమే కాకుండా, చిరుధాన్యాల వాడకాన్ని పెంచడం ద్వారా ప్రజల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఈ జొన్నల పంపిణీ విధానం అమల్లోకి రానుంది. రైతులకు గిట్టుబాటు ధరపై కీలక నిర్ణయం.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారు, జొన్నలు, మొక్కజొన్నలకు మద్దతు ధర కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో ధరలు తగ్గుతున్న నేపథ్యంలో, మొక్కజొన్నలతో పాటు జొన్నలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి మద్దతు లేకపోయినప్పటికీ, రాష్ట్ర నిధులతోనే ఈ సేకరణ ప్రక్రియను చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. యాసంగి సీజన్‌లో పండించిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

# విజయ్ గెలుపు దిగ్భ్రాంతికరం..
# 'ఒకే ఒక్కడు' తరహా మార్పులు ప్రమాదం

- తమిళనాడులో విజయ్ పార్టీ విజయం ఊహించనిదన్న జయప్రకాశ్ నారాయణ
- 'ఒకే ఒక్కడు' సినిమా లాగా క్షణాల్లో మార్పులు కోరడం ప్రమాదకరమని వ్యాఖ్య
- మంచి పాలన అందించినా స్టాలిన్ ఓడిపోవడం ఆశ్చర్యపరిచిందన్న లోక్‌సత్తా అధినేత
- ప్రజలు సైలెంట్‌గా విజయ్ వైపు మొగ్గు చూపారని విశ్లేషణ
- పెద్ద సిద్ధాంతాలు లేకుండా కొత్త ముఖం గెలవడం దిగ్భ్రాంతికరమని వ్యాఖ్య



**హైదరాబాద్, మే 6 (నినాదం) :** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన నటుడు విజయ్, ఆయన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఘన విజయంపై లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ పెట్టిన రెండేళ్లకే ద్రవిడ దిగ్గజాలను పక్కకు నెట్టి విజయ్ ముఖ్యమంత్రి పీఠానికి చేరువ కావడం తాను ఊహించలేదని, ఈ ఫలితాలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని అన్నారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు తన విశ్లేషణను పంచుకున్నారు. జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ... "నిజాయితీగా చెప్పాలంటే ఇది ఎవరూ ఊహించని ఫలితం. కమల్ హాసన్, రజినీకాంత్ వంటి ఎందరో సినీ నటులకు దక్కని రాజకీయ విజయం విజయ్‌కు దక్కింది. తమిళనాడులో 50 శాతం పట్టణీకరణ ఉంది, ఉన్నంతలో అది మంచి పరిపాలన అందిస్తున్న రాష్ట్రం. అయినా సరే, మంచి పాలన అందిస్తున్న స్టాలిన్ ఓడిపోయి, ప్రజలు విజయ్ వైపు మొగ్గు చూపారు" అని అన్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన మరింత లోతుగా విశ్లేషించారు. "ప్రజలు, ముఖ్యంగా జన్‌జీ తరం యువత, తక్షణమే అద్భుతాలు జరగాలని ఆశిస్తున్నారు. 'ఒకే ఒక్కడు' సినిమాలో అర్జున్ ఒక్కరోజులో అన్నీ మార్చేసినట్టు, క్షణాల్లో మార్పు రావాలని కోరుకుంటున్నారు. ఈ ఆలోచనా విధానం చాలా ప్రమాదకరం. అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ, దానికి సమయం పడుతుంది. మార్పును కోరుకోవడంలో తప్పు లేదు, కానీ అది తక్షణమే జరగాలనుకోవడం దేశానికి మంచిది కాదు" అని హెచ్చరించారు. స్టాలిన్ ఓటమి వెనుక కుట్రలు, వ్యూహాలు ఉండి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ప్రజలు మూడో కంటికి తెలియకుండా చాలా సైలెంట్‌గా విజయ్ వైపు మళ్లారు. ప్రజల తీర్పును మనం విశ్లేషించలేం. ఎలాంటి బలమైన సిద్ధాంత ప్రాతిపదిక లేకుండా, కేవలం తన నటనతో జనాన్ని మెప్పించిన ఒక కొత్త ముఖం, ఇలా అనూహ్యంగా గెలవడం నిజంగా దిగ్భ్రాంతికరం. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ పరిణామంపై ఆత్మవిమర్శ చేసుకోవాలి, లేదంటే దేశం ప్రమాదంలో పడుతుంది" అని జయప్రకాశ్ నారాయణ స్పష్టం చేశారు.

# వినూత్న సమస్యతో బాధపడుతున్న కండక్టర్‌కు అండగా టీజీఎస్‌ఆర్టీసీ

- అసాధారణ ఎత్తు కారణంగా విధుల్లో ఇబ్బంది పడుతున్న కండక్టర్‌కు ఊరట
- బస్సు ఎత్తు కంటే తన ఎత్తు ఎక్కువ ఉండటంతో మెడ, నడుము నొప్పులతో వేదన
- కండక్టర్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- శాశ్వత ప్రాతిపదికన ప్రత్యామ్నాయ విధులకు బదిలీ చేస్తూ టీజీఎస్‌ఆర్టీసీ ఆదేశాలు
- మానవతా దృక్పథంతో స్పందించిన యాజమాన్యంపై సర్వత్రా ప్రశంసలు



**హైదరాబాద్, మే 6 (నినాదం) :** అసాధారణమైన తన ఎత్తు కారణంగా విధుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ బస్ కండక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో అతడి సమస్యను అర్థం చేసుకుని, ప్రత్యామ్నాయ విధులను కేటాయించి పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని మెహిదీపట్నం డిపోలో అమీన్ అహ్మద్ అన్సారీ బస్ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఎత్తు 6.5 అడుగులు (198 సెం.మీ.). అయితే, సాధారణంగా బస్సుల్లోని అంతర్గత ఎత్తు కేవలం 6.4 అడుగులు మాత్రమే ఉంటుంది. దీంతో బస్సులో టికెట్లు ఇచ్చేందుకు తిరిగేటప్పుడు ఆయన నిత్యం వంగి ఉండాల్సి వచ్చేది. సుమారు 10 గంటల షిఫ్ట్‌లో కనీసం ఐదు ట్రిప్పులు వేయాల్సి ఉండటంతో ఆయన తీవ్రమైన మెడ, నడుము నొప్పులతో బాధపడేవారు. ఈ శారీరక ఇబ్బందుల కారణంగా తనను వేరే విధులకు మార్చాలని అన్సారీ యాజమాన్యాన్ని అభ్యర్థించారు. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన యాజమాన్యం గతంలో ఏడాది పాటు తాత్కాలికంగా ఇతర విధులను కేటాయించింది. ఏప్రిల్ 28తో ఆ గడువు ముగియడంతో అన్సారీ పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారం చూపింది. అతడి సేవలను టీజీఎస్‌ఆర్టీసీ బస్ పాస్ విభాగంలో గానీ, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) కౌంటర్లలో గానీ అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని యాజమాన్యం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కారుణ్య నియామకం కింద 2021లో ఉద్యోగం పొందిన అన్సారీకి ఈ నిర్ణయం గొప్ప ఊరటనిచ్చింది. కండక్టర్‌గా పనిచేస్తూ మరణించిన తన తండ్రి స్థానంలో అన్సారీ ఉద్యోగంలో చేరారు. ఒక ఉద్యోగి ఎదుర్కొంటున్న వినూత్న సమస్యకు మానవత్వంతో స్పందించిన టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# బీఆర్ఎస్ నేత క్రిశాంక్ కు బెయిల్ మంజూరు



**మేడ్చల్ మే 06(నినాదం):** కేసు వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలులో జరిగిన అవకతవకలు, మంత్రులపై తాను చేసిన విమర్శల కారణంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఈ సందర్భంగా ఆరోపిస్తున్నారు.

# తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, మే 06(నినాదం):** అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం మహాదేవపూర్ మండలంలోని మహాదేవపూర్, సూరారం గ్రామాలలో పర్యటించిన కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా తెలుసుకొని, రైతులతో ముకాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు రవాణా, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపిడిఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకు పోవడం ఖాయం

- వరంగల్ రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్



**వరంగల్, మే 06(నినాదం):** కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుబిడ్డగా వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా కేసీఆర్ పాలన కొనసాగిందని అన్నారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఎ÷-లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ. 72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.

# మక్క కొనుగోళ్లు చేపట్టండి

- నిర్మల్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన



**నిర్మల్, మే 06(నినాదం):** మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల ఆందోళన చేపట్టారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామ రైతులు నిర్మల్– బైంసా జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే కొనుగోలు కేంద్రాలు లేక పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేక, అప్పులు చేసి పండిస్తే తీరా దాళారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జాంమ్ ఏర్పడింది.

# పాపికొండల యాత్ర నిలిపివేత



**భద్రాచలం, మే 6 (నినాదం) :** తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు చేదువార్త చెప్పారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండల విహారయాత్ర'ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను రద్దు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# బాధితులకు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకుంటామన్న న్యాయవాది



**హైదరాబాద్, మే 6 (నినాదం) :** మైక్రోఫైనాన్స్ కేసులో గాయని మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన చేశారు. ఈ కేసులోని బాధితులకు మంగ్లీ, ఆమె సోదరుడు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకోవడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. మైక్రోఫైనాన్స్ కేసులో మంగ్లీ ప్రతిసారి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివపై గద్వాల్, గచ్చిబౌలి, నల్గొండలలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులకు సంబంధించి వారు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మైక్రోఫైనాన్స్ కేసులో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తాము డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసినట్లు తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలుస్తామని అన్నారు. బాధితులకు న్యాయం జరగాలని ఆయన తెలిపారు. మైక్రోఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు సహా మరికొంతమంది కోట్లాది రూపాయల మోసగించారని పలువురు బాధితులు సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావును కలిశారు. ఈ విషయం తెలుసుకోవడానికి సుబ్బారావు సంప్రదించగా, మంగ్లీ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మరోవైపు, తనపై దుష్ప్రచారం చేయడం ద్వారా న్యాయవాది సుబ్బారావు ప్రాచుర్యం పొందాలనుకుంటున్నారని మంగ్లీ అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

ninadam.in

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్




# మోదీ, అమిత్ షాల వ్యూహాలపై శశి థరూర్ ప్రశంసలు



న్యూ ఢిల్లీ, మే 6 (నినాదం) : కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తనదైన శైలిలో మరోసారి ముక్కుసూటిగా స్పందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాల ఎన్నికల వ్యూహాలను ప్రశంసించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తమ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో యూడీఎఫ్ విజయం సాధించినప్పటికీ, మిగిలిన రాష్ట్రాల్లో పార్టీ పనితీరు నిరాశాజనకంగా ఉందని గుర్తు చేస్తూ, బీజేపీ నేతల నిర్వహణా నైపుణ్యాల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా బెంగాల్, అసోంలలో బీజేపీ అనుసరించిన బలమైన వ్యూహాలను ఆయన కొనియాడారు. పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా, అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ అధికార పీఠాన్ని అధిరోహించడానికి సిద్ధమవుతోంది. మరోవైపు తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుండటం దక్షిణాది రాజకీయాల్లో పెను మార్పుగా కనిపిస్తోంది. పుదుచ్చేరిలో సైతం ఎన్డీఏ కూటమి అధికారాన్ని చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది.

# సిఎం పదవికి హిమంతబిశ్వ శర్మ రాజీనామా

- గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పణ



గౌహతి, మే 06(నినాదం): అస్సాం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. బుధవారం లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ.. తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త సీఎంని ఎంపిక చేస్తారని శర్మ తెలిపారు. కాగా, 126 మంది సభ్యులున్న అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరగగా.. మే 4న ఫలితాలు విడుదల అయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది.

# ప్రజాసంక్షేమం లక్ష్యంగా టిడిపి పాలన

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



ఒంగోలు, మే 06(నినాదం): ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం కోసం టీడీపీ పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. జగన్ చేసిన మోసాన్ని వైసీపీ నేతలే స్వయంగా ఒప్పుకున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విలువలు లేని పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. బుధవారం ఒంగోలులో టీడీపీ పార్లమెంట్ నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు వేసిన పునాదులతో 44 ఏళ్ల నుంచి టీడీపీ జెండా రెపరెపలాడుతోందని మంత్రి ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ చంద్రబాబు, లోకేశ్ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# ఇండియాకు వచ్చేస్తా..

## తక్కువ జీతమైనా సరే.. అమెరికా టెక్కీ ఆవేదన..

- తీవ్రమైన ఒత్తిడి, అనారోగ్యంతో అమెరికా ఉద్యోగాన్ని వదిలేయాలనుకుంటున్న ఎన్‌ఆర్ఐ
- ఏఐ ఒత్తిడి, ఆఫీస్ రాజకీయాలతో ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన
- ఇండియాకు వచ్చి తక్కువ జీతంతోనైనా పనిచేసేందుకు సిద్ధమని వెల్లడి
- మానసిక ఆరోగ్యమే ముఖ్యమంటూ నెటిజన్ల మద్దతు.. పలువురి సలహాలు




న్యూయార్క్, మే 06(నినాదం): అమెరికాలో అధిక జీతంతో కూడిన ఉద్యోగం ఎంతోమంది కల. కానీ, ఆ కల వెనుక ఉండే ఒత్తిడి, ఆందోళన జీవితాన్నే నరకంగా మార్చేస్తాయని ఓ ఎన్‌ఆర్ఐ టెక్కీ అనుభవం చెబుతోంది. గత 8 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అక్కడి ఉద్యోగంలో తీవ్రమైన ఒత్తిడి, అనారోగ్య సమస్యలు తట్టుకోలేక ఇండియాకు తిరిగి వచ్చేయాలని భావిస్తున్నట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ విషయంలో ఏం చేయాలో తెలియక నెటిజన్ల సలహా కోరారు. సుమారు 7 ఏళ్ల అనుభవం ఉన్న ఈ టెక్కీ తన పోస్టులో పలు కీలక విషయాలు వెల్లడించారు. "ప్రారంభంలో అంతా బాగానే ఉన్నా, గత ఏడాది నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. టాక్సిక్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై పనిచేయాలనే తీవ్రమైన ఒత్తిడి, ఆఫీస్ రాజకీయాలు నన్ను కుంగదీస్తున్నాయి. ప్రస్తుతం అమెరికాలో 5 ఏళ్లకు పైగా అనుభవం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. జీవితంలో తనకు సరైన సపోర్ట్ సిస్టమ్ లేదని, ఒంటరిగా ఈ ఒత్తిడిని ఇక భరించలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి తన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన తెలిపారు. "గత ఏడాది నుంచి హై బీపీ, డిప్రెషన్ కోసం మందులు వాడుతున్నాను. ప్రతి ఉదయం నిద్రలేవగానే స్ట్రోక్ వస్తుందేమోనన్న భయం వేస్తోంది. రోజురోజుకీ టెక్నాలజీ రంగంపైనే విరక్తి కలుగుతోంది" అని తన ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఈ నేపథ్యంలో ఇండియాకు తిరిగి వచ్చి, తక్కువ జీతం అయినా సరే ప్రశాంతమైన జీవితాన్నిచ్చే ఉద్యోగం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. "భవిష్యత్తుపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియడం లేదు. పూర్తిగా నిస్సహాయ స్థితిలో ఉన్నాను. దయచేసి మీ అభిప్రాయాలు పంచుకోండి" అని ఆయన కోరారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆయనకు మద్దతుగా నిలిచారు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "కుటుంబానికి, స్నేహితులకు దగ్గరగా ఉండటం కోసం తిరిగి రావడం మంచి నిర్ణయమే. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు" అని ఒకరు కామెంట్ చేశారు. "జీతం తక్కువైనా ఒత్తిడి లేని ఉద్యోగంలో చేరండి. ఇప్పటివరకు మీరు చాలా కష్టపడ్డారు. ఇక మీ ఆరోగ్యంపై దృష్టి పెట్టండి" అని మరో యూజర్ సలహా ఇచ్చారు. "మీ మానసిక ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు" అంటూ చాలామంది ఆయనకు ధైర్యం చెప్పారు.

## శబరిమల సెగ.. కేరళలో ఆ ఇద్దరు మంత్రుల ఓటమికి 'దేవస్వం' కారణమైందా?

- విజయన్ ప్రభుత్వంలో పనిచేసిన కడకంపల్లి సురేంద్రన్, వీఎన్ వాసవన్ పరాజయం
- శబరిమల బంగారు కుంభకోణం ఆరోపణలను ప్రచారాస్త్రంగా వాడిన విపక్షాలు
- లెఫ్ట్ ఫ్రంట్ ఓటమిలో అయ్యప్ప ఆలయ వివాదం పాత్రపై రాజకీయ వర్గాల్లో చర్చ
- ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు శబరిమల అంశం కూడా ప్రభావం చూపిందన్న విశ్లేషణలు




శబరిమల మే 06(నినాదం): కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగలగా, ఇప్పుడు కీలకమైన ప్రశ్న రాజకీయ వర్గాలను తొలిచేస్తోంది. పినరయి విజయన్ ప్రభుత్వంలో రెండు దఫాలుగా దేవస్వం (దేవదాయ) శాఖను పర్యవేక్షించిన ఇద్దరు సీనియర్ మంత్రుల ఓటమికి శబరిమల వివాదానికి ఏమైనా సంబంధం ఉందా? అయ్యప్ప ఆలయ వ్యవహారాలు, దాని చుట్టూ అల్లుకున్న ఆరోపణలు వారి పరాజయాన్ని శాసించాయా? అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో సీపీఐ(ఎం) సీనియర్ నేతలు, మంత్రులుగా పనిచేసిన కడకంపల్లి సురేంద్రన్, వీఎన్ వాసవన్ అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. 2016-21 మధ్య లెఫ్ట్ ప్రభుత్వంలో దేవస్వం మంత్రిగా పనిచేసిన సురేంద్రన్, కాజకూటం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. అయితే, బీజేపీ సీనియర్ నేత వి. మురళీధరన్ చేతిలో ఆయన ఓడిపోయారు. అలాగే, 2021-26 మధ్య దేవస్వం శాఖను చూసిన వాసవన్, తన సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నాటకం సురేశ్ చేతిలో పరాజయం చవిచూశారు. ఈ ఓటముల వెనుక ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక సమీకరణాలు ఉన్నప్పటికీ, శబరిమల అంశం ప్రచారంలో ప్రధానంగా నిలిచింది. ముఖ్యంగా 'శబరిమల బంగారు కుంభకోణం' ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు తమ ప్రచారాస్త్రంగా మార్చుకున్నాయి. ఈ ఇద్దరు మంత్రులనే కాకుండా మొత్తం లెఫ్ట్ ప్రభుత్వంపైనే విమర్శలు ఎక్కుపెట్టాయి. ఆలయ వ్యవహారాల నిర్వహణలో ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవడంలో విపక్షాలు సఫలమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేరళలో శబరిమల కేవలం ఒక పుణ్యక్షేత్రం కాదు, అదొక సున్నితమైన భావోద్వేగ, రాజకీయ అంశం. అయ్యప్ప ఆలయానికి సంబంధించిన ఏ చిన్న వివాదమైనా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ ఎన్నికల్లో ఆ నమ్మకాన్ని, సెంటిమెంట్‌ను విపక్షాలు బలంగా ఉపయోగించు కున్నాయి. దేవస్వం శాఖతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఇద్దరు మంత్రులు ఒకేసారి ఓడిపోవడం యాదృచ్ఛికమా? లేక శబరిమల వివాదాల ప్రభావమా? అనేదానికి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయినా, ఈ పరిణామం లెఫ్ట్ ఫ్రంట్‌కు ఇబ్బందికర ప్రశ్నలను మిగిల్చింది. విశ్వాసం, పాలన ముడిపడి ఉన్న కేరళ రాజకీయాల్లో నమ్మకాలకు సంబంధించిన అంశాలు ఎన్నికల ఫలితాలను ఎంతగా ప్రభావితం చేస్తాయో ఈ తీర్పు స్పష్టం చేస్తోంది.

# తొలి ఎన్నికల్లోనే టీవీకే సంచలనం...

## - ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులతో విజయ్ వ్యూహం సక్సెస్

- ఒక్క బ్రాహ్మణ అభ్యర్థికి కూడా టికెట్ ఇవ్వని డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ
- ఆరుగురు బ్రాహ్మణ అభ్యర్థులను నిలబెట్టిన సీమాన్ పార్టీ ప్రయోగం విఫలం
- 108 స్థానాలతో తమిళనాట అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే




చెన్నై మే 6 (నినాదం) : తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తన తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే సంచలనం సృష్టించింది. ప్రధాన ద్రవిడ పార్టీలన్నీ దూరంగా పెట్టిన ఒక సాహసోపేతమైన ప్రయోగానికి టీవీకే శ్రీకారం చుట్టింది. ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులను బరిలోకి దింపి ఆ పార్టీ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఫలించింది. మైలాపూర్ నుంచి పార్టీ కోశాధికారి వెంకటరామన్, శ్రీరంగం నుంచి రమేశ్ అనే ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులను టీవీకే నిలబెట్టగా, వారిద్దరూ తమ తమ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించారు. దీంతో వీరిద్దరు కొత్త అసెంబ్లీలో బ్రాహ్మణ ప్రతినిధులుగా నిలిచారు. తమిళ రాజకీయాల్లో ఇది ఒక ముఖ్యమైన ఘట్టంగా చెప్పవచ్చు. దాదాపు 35 ఏళ్లలో తొలిసారిగా డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు ఒక్క బ్రాహ్మణ అభ్యర్థికి కూడా టికెట్ కేటాయించలేదు. దశాబ్దాలుగా ఈ వర్గం ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తున్నా, ప్రధాన పార్టీల జాబితా నుంచి పూర్తిగా కనుమరుగు కావడం ఇదే మొదటిసారి. ద్రవిడ రాజకీయాల్లో సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రాతినిధ్యానికే పెద్దపీట వేస్తున్న తరుణంలో టీవీకే వ్యూహం కొత్త చర్చకు దారితీసింది. ఆసక్తికరంగా సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) కూడా ఈ ప్రయోగాన్ని అనుకరించే ప్రయత్నం చేసింది. బ్రాహ్మణ జనాభా అధికంగా ఉండే టి.నగర్, మైలాపూర్, సైదాపేట్, అలందూర్ వంటి నియోజకవర్గాల్లో ఏకంగా ఆరుగురు బ్రాహ్మణ అభ్యర్థులను నిలబెట్టింది. అయితే, ఎన్‌టీకే ప్రయోగం పూర్తిగా విఫలమైంది. వారి ఆరుగురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. కేవలం ఒక వర్గం వారిని నిలబెట్టినంత మాత్రాన ఎన్నికల్లో గెలవలేరని ఇది స్పష్టం చేస్తోంది. ఈ కుల సమీకరణాలకు అతీతంగా మొత్తం ఎన్నికల ఫలితాల్లో టీవీకే తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. సుమారు 108 స్థానాల్లో గెలుపొంది, అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. వ్యూహాత్మకంగా కొద్దిమంది దికే అవకాశమిచ్చిన టీవీకే వ్యూహం ఫలించగా, అదే బాటలో వెళ్లిన ఎన్‌టీకే విఫలం కావడం తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలను సూచిస్తోంది.

# అమెరికాలో భారీగా విస్తరిస్తున్న చైనాకు చెందిన ప్రమాదకర చీమలు..

## కుడితే సూదిని నేరుగా గుచ్చినట్టే ఉంటుంది!

- టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్ సహా సుమారు 20 రాష్ట్రాలకు విస్తరించిన ఏషియన్ నీడిల్ ఆంట్స్
- కొన్నేళ్లుగా అసాధారణంగా పెరిగిన చీమల జనాభా
- అలర్జీ ఉన్నవారికి ప్రాణాపాయం కలిగే పరిస్థితి



న్యూయార్క్, మే 06(నినాదం): అమెరికాలో వేగంగా విస్తరిస్తున్న చైనాకు చెందిన 'ఏషియన్ నీడిల్ ఆంట్' అనే ప్రమాదకరమైన చీమల జాతి గురించి ఆరోగ్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చైనా మూలాలు కలిగిన ఈ 'ఏషియన్ నీడిల్ ఆంట్స్' ప్రస్తుతం అమెరికాలోని టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్, పెన్సిల్వేనియా సహా సుమారు 20 రాష్ట్రాలకు విస్తరించాయి. ఐదో వంతు అంగుళం పరిమాణంలో, ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండే ఈ చీమలు అమెరికాలో దశాబ్దాల క్రితమే కనిపించినప్పటికీ, గత కొన్నేళ్లుగా వీటి జనాభా అసాధారణంగా పెరిగింది. సాధారణ చీమల మాదిరిగా ఇవి పుట్టలు పెట్టకుండా, నేల రాలిన ఆకులు, కుళ్ళిన మొద్దులు, అటవీ ప్రాంతాల్లో నివసిస్తాయి. దీనివల్ల మనుషులు తెలియకుండానే వీటిపై కాలు వేయడం లేదా తాకడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చీమల కుట్టు అత్యంత వేదనాభరితంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక పదునైన సూదిని శరీరంలోకి నేరుగా గుచ్చితే ఎంతటి తీవ్రమైన నొప్పి కలుగుతుందో, ఈ చీమ కుడితే అంతటి నొప్పి ఉంటుందని కీటక శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ నొప్పి కొన్ని గంటల పాటు బాధిస్తుంది. ముఖ్యంగా అలర్జీ ఉన్నవారిలో ఇది 'అనాఫిలాక్సిస్' వంటి ప్రాణాపాయ స్థితికి దారితీసే ప్రమాదం ఉంది. వీటి స్టింగర్ ఎంత బలంగా ఉంటుందంటే, బట్టల గుండా కూడా కుట్టగలదు. అయితే, ఈ చీమలు సహజంగా దుందుడుకు స్వభావం కలిగినవి కావని, తమకు ముప్పు పొంచి ఉందని భావించినప్పుడు మాత్రమే కుడతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే తోటపని చేసేవారు లేదా బయట తిరిగే వారు గ్లోవ్స్ ధరించాలని, ఈ చీమలు కనిపిస్తే జాగ్రత్తగా అక్కడి నుండి తప్పుకోవాలని సూచిస్తున్నారు. వీటి వ్యాప్తిని అడ్డుకోవడం ఇప్పుడు దాదాపు అసాధ్యమని, అమెరికా పర్యావరణంలో ఇవి ఒక భాగమైపోయాయని అమెరికా వ్యవసాయ శాఖ అభిప్రాయపడింది.

# ఆమెను బయటకు గెంటేయండి

## ఓడిపోయినా కుర్చీ వదలని దీదీపై సీనియర్ న్యాయవాది సంచలన వ్యాఖ్యలు!

- ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజీనామా చేసేది లేదని మమతా బెనర్జీ స్పష్టీకరణ
- మమత వైఖరి ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాల్ అన్న సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ
- ఎన్నికల ఫలితాల ధ్రువీకరణ తర్వాత ఆమె సీఎం ఆఫీసులో చొరబాటుదారు అని వ్యాఖ్య
- మమతను అవసరమైతే పోలీసులతో ఖాళీ చేయించాలని డిమాండ్



కోల్‌కత్తా, మే 6 (నినాదం) : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ రాజీనామా చేసేందుకు నిరాకరించడంపై సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమె ప్రవర్తన క్షమించరానిదని, ఇది మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే విసిరిన సవాల్ అని అభివర్ణించారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల సంఘం ఫలితాలను ధ్రువీకరించిన క్షణం నుంచి ముఖ్యమంత్రి తన పదవిని కోల్పోతారు. అయినా ఆమె కుర్చీకి అతుక్కుపోవాలని చూస్తున్నారు. ఇది అవమానకరం. ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలి. గౌరవంగా రాజీనామా చేయకుండా మొండికేస్తున్నందున, గవర్నర్ తన అధికారాలను ఉపయోగించి ఆమెను అధికారికంగా బర్తరఫ్ చేయాలి. ఆమె ప్రవర్తన దృష్ట్యా, ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలి. ఆఫీస్ నుంచి ఆమెను బయటకు గెంటేయాలి" అని జెఠ్మలానీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఇప్పటికీ కార్యాలయాన్ని ఆక్రమించుకుంటే, గవర్నర్ పోలీసులను పంపి ఖాళీ చేయించవచ్చని సూచించారు. "ఫలితాలు ధ్రువీకరించిన తర్వాత ఆమె సీఎం కార్యాలయంలో ఒక చొరబాటుదారు మాత్రమే" అని స్పష్టం చేశారు. మరోవైపు తాను ఓడిపోలేదని, అందుకే రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయనని మమతా బెనర్జీ ప్రకటించారు. తన పార్టీ నుంచి 100 సీట్లను దొంగిలించారని ఆమె ఆరోపించారు. దీనిపై జెఠ్మలానీ స్పందిస్తూ, ఆరోపణలకు ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలని, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురయ్యే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. బెంగాల్ అసెంబ్లీ ప్రస్తుత టర్మ్ ఈ నెల 7తో ముగియనుండటంతో ఈ పరిణామాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.

# తమిళనాట తెలుగులో ప్రచారం.. ప్రశాంత్ కిశోర్ టీమ్ నుంచి అసెంబ్లీకి..

## శివకాశి ఎమ్మెల్యేగా కీర్తన సంచలనం!

- విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ తరపున శివకాశి నుంచి విజయం
- గతంలో ప్రశాంత్ కిశోర్ బృందంలో, టీడీపీ సోషల్ మీడియా విభాగంలో సేవలు
- స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి
- శివకాశి నియోజకవర్గానికి తొలి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు



చెన్నై మే 6 (నినాదం) : తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సృష్టించిన సంచలనాలు కొనసాగుతున్నాయి. ఎందరో సామాన్యులను అసెంబ్లీకి పంపిన ఆ పార్టీ నుంచి ఇప్పుడు మరో ఆసక్తికరమైన విజేత కథ వెలుగులోకి వచ్చింది. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని ఒక యువతి, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందంలో పనిచేసిన అనుభవంతో తన నియోజకవర్గంలో తెలుగులో ప్రసంగించి మరీ ఓటర్ల మనసులు గెలుచుకున్నారు. ఆమే విరుద్‌నగర్ జిల్లా శివకాశి నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే కీర్తనా సంపత్.

**వ్యూహకర్త నుంచి ప్రజా ప్రతినిధిగా..**

కీర్తనా సంపత్ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసిన ఆమె, డేటా అనలిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. తన ప్రతిభతో దేశంలోనే ప్రముఖ రాజకీయ వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ (ఐప్యాక్) బృందంలో చేరారు. గోవా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల్లో తెరవెనుక వ్యూహరచనలో కీలక పాత్ర పోషించారు. 2021 తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ గెలుపు కోసం కూడా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రంగా టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆమె నాయకత్వం వహించారు. ఈ క్రమంలోనే ఆమెకు తెలుగు భాషపై మంచి పట్టు లభించింది.

**సొంతూరి సమస్యలపై పోరాటం**


దేశవ్యాప్తంగా ఎందరో నేతల గెలుపు కోసం వ్యూహాలు రచించిన కీర్తనను తన సొంత ప్రాంతంలోని సమస్యలు తీవ్రంగా ఆలోచింపజేశాయి. బాణాసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశిలో తరచూ జరిగే అగ్ని ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆమెను కలచివేశాయి. తాగునీరు, సరైన రోడ్లు, వైద్య సదుపాయాలు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడం, ఉన్నత చదువులు చదివిన యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లడం లేదా స్థానికంగా టాక్సీ డ్రైవర్లుగా మిగిలిపోవడం వంటి అంశాలు ఆమెను రాజకీయాల వైపు నడిపించాయి. దీంతో లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలి సొంతూరికి తిరిగి వచ్చారు.

**విజయ్ అవకాశం.. తెలుగులో ప్రచారం.. చారిత్రక విజయం**

సొంతూరికి వచ్చిన కీర్తన.. సోషల్ మీడియా ద్వారా స్థానిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తూ చాలా తక్కువ సమయంలోనే ప్రజల మన్ననలు పొందారు. ఆమె ప్రజాదరణను గమనించిన టీవీకే అధినేత విజయ్, ఎన్నికలకు కేవలం నెల రోజుల ముందు ఆమెకు శివకాశి టికెట్ కేటాయించారు. ప్రచారంలో తనదైన ముద్ర వేసిన కీర్తన, నియోజకవర్గంలోని తెలుగు ఓటర్లను ఆకట్టుకోవడానికి తెలుగులో ప్రసంగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె వినూత్న ప్రచార శైలి, స్థానిక సమస్యలపై ఆమెకున్న అవగాహన ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫలితంగా ఆమె ప్రత్యర్థులపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. అంతేగాక శివకాశి నియోజకవర్గ చరిత్రలోనే తొలి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. ఒక డేటా అనలిస్ట్ ప్రజా ప్రతినిధిగా మారిన ఆమె కథ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

- హెల్మెట్ లేని నేతలకు రెట్టింపు జరిమానా విధించాలని మంత్రి ఆదేశం



అమరావతి, మే 6 (నినాదం) : ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ట్రాఫిక్ నిబంధనల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రెట్టింపు జరిమానా విధించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో 'సురక్షిత రోడ్లు.. సురక్షిత జీవితం' నినాదంతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకు జరిగిన ఈ బైక్ ర్యాలీలో మంత్రి అనిత మాట్లాడుతూ.. "లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనేవారు, ప్రాణాలను కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను కొని ధరించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారు? ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ప్రాణం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి" అని అన్నారు. ఈ సందర్భంగా తన పాయకరావుపేట నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను గుర్తుచేసుకుని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. మన నియోజకవర్గంలో ఒకే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశాయి. ఇకనైనా మేల్కొని 'హెల్మెట్ ధరిద్దాం-సురక్షితంగా పయనిద్దాం' అనే నినాదాన్ని పాటిద్దాం. మన ప్రాణాలను, మన కుటుంబాల భవిష్యత్తును కాపాడుకుందాం" అని అనిత పిలుపునిచ్చారు. ర్యాలీలో భాగంగా ఆమె పలువురు వాహనదారులకు స్వయంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.